క్లుప్తంగా

శివాలయాల్లో గ్రహణదోష నివారణ పూజలు



కవిటి చంద్రశేఖర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కవిటి: మండలంలోని వివిధ శివాలయాల్లో ఆదివారం చంద్రగ్రహణ దోషం కలిగిన నక్షత్ర రాశుల వారు గ్రహణ దోష నివారణ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలను సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం వేకువజామునుంచే భక్తులు శివాలయాల్లో పూజలకోసం బారులు తీరారు. ఒరియా సంప్రదాయంలో కార్తీకమాస దీక్షలు కూడా తోడవడంతో మండలంలోని వివిధ ఆలయాల్లో ఒరియా మాట్లాడే వారంతా ప్రత్యేక పూజలు చేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవదాస్‌రెడ్డి

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిస్తోందని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. పెద్దకొజ్జిరియా గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 1.31 కోట్లతో తారురోడ్డు పూర్తిచేసిన తర్వాత, వీధి మధ్యలో 260 మీటర్ల పొడవు గల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ పొందల ఢిల్లీరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లద్దు కేశవపాత్రో, వార్డు మెంబర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పెద్దపులి సంచారం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- సమన్వయకర్త సాయిరాజ్

కంచిలి: నియోజకవర్గంలోని ఉద్దానం ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ సూచించారు. ఈ మేరకు బల్లిపుట్టుగలో ఆయన కార్యాలయం నుంచి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కంచిలి మండలం అమ్మవారిపుట్టుగ గ్రామ పంట పొలాల్లో పెద్దపులి సంచరిస్తున్న ఆనవాళ్లు ఉన్నట్టు తెలుసుకున్న నేపథ్యంలో డీఎఫ్‌వో నిషాకుమారితో మాట్లాడి సమాచారం అడిగి తెలుసుకున్నట్టు పేర్కొన్నారు. పులి గాలింపు చర్యలు చేపడుతున్నామని అటవీ శాఖ అధికారులు తెలియజేసినట్లు వెల్లడించారు. పులి సంచారం నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో పంట పొలాల్లోను, కొబ్బరి తోటల్లోను ఉండకుండా ఇంటి వద్దనే ఉండాలని కోరారు.


ప్రజా రక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలి

టెక్కలి రూరల్: వచ్చేనెల రెండో తేదీన మందస నుంచి ప్రారంభంకానున్న ప్రజా రక్షణ భేరి బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవింద్ కోరారు. ఆదివారం టెక్కలిలోని సీపీఎం కార్యాలయంలో నంబూరి షణ్ముఖరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలను వ్యతిరేకిస్తూ బస్సు యాత్రను చేపడుతున్నట్టు పేర్కొన్నారు నవంబర్ 15వ తేదీన విజయవాడలో బహిరంగ సభ ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు బి.వాసు, హెచ్.ఈశ్వరరావు, పోలయ్య పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

ఇచ్ఛాపురం: మున్సిపల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తామని.. సభ్యులందరూ హాజరు కావాలన్నారు.

కాలువల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: నీలంపేట పంచాయతీ జగన్నాధపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టనున్న కాలువల నిర్మాణ పనులకు టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పట్నాన శివ, నాయకులు మెట్టు వాసు, దాసరి శిమ్మయ్య, సోషల్‌మీడియా కన్వీనర్ ఎస్.నారాయణరావు, జేసీఎస్ కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, అక్కురాడ సురేష్, రాంపాత్రుణి శివారెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా..



కాశీబుగ్గ: ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీఏసీఎస్ భవనం



వజ్రపుకొత్తూరు రూరల్: ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అక్కుపల్లి పీహెచ్‌సీ భవనాలు

- పీఏసీఎస్, పీహెచ్‌సీ భవనాలు

కాశీబుగ్గ: పలాస కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ స్థలంలో దీని నిర్మాణం కోసం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కొద్ది నెలల క్రితం శంకుస్థాపన చేశారు. పీఏసీఎస్ నిధులు కోటి రూపాయలతో బహుళ అంతస్తుల భవనంతో పాటు గోదాం నిర్మాణం పూర్తి చేశారు. కొద్ది రోజుల్లో భవనాన్ని ప్రారంభిస్తామని పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరావు తెలిపారు. బొడ్డపాడు, బ్రాహ్మణతర్లా పంచాయతీల్లో పీఏసీఎస్‌కు సంబంధించి పిఎసిఎస్ గొడౌన్లు ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితులు, అధిక నిల్వల దృష్ట్యా నూతన భవనం నిర్మించామని చెప్పారు.

అక్కుపల్లిలో పీహెచ్‌సీ భవనం..

వజ్రపుకొత్తూరు రూరల్: గత టీడీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసింది. అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ వైద్యం ప్రజలకు చేరువవుతోంది. ఉద్దానం, తీర ప్రాంతంలో గల సుమారు 30 గ్రామాలకు అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉంది. అయితే ఏళ్లనాటి ఆసుపత్రి కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీన్ని గత పాలకులు పట్టించుకోలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తున్న నేపథ్యంలో సుమారు రూ. 1.75 కోట్ల వ్యయంతో కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. భవనాలన్నీ పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

వృద్ధులకు అన్నదానం

ఇచ్ఛాపురం: పట్టణంలోని సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో 30 మంది పేద వృద్ధులకు సత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో దేవరపల్లి సుబ్బారావు, వజ్రపు రమణమూర్తి ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. సత్యసాయి సేవాసమితి సభ్యుల సేవాగుణాన్ని స్థానికులు కొనియాడారు.

ఆకట్టుకున్న కోయ నృత్యం



కోయ నృత్యంలో కళాకారులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తేరు. ఒడిశా, ఆంధ్రా ప్రాంతాల నుంచి భక్తులు సంబరాలతో అమ్మవారి ఎదుట మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తేలుకుంచి, ఇచ్ఛాపురం, ఒడిశా సుర్లా నుంచి వచ్చిన కోయనృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఇచ్ఛాపురానికి ఎమ్మెల్యే అశోక్ చేసింది శూన్యం



ఇచ్ఛాపురం రూరల్:సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోర పుష్ప



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు



కవిటి: సమావేశంలో మాట్లాడుతున్న కడియాల ప్రకాష్



సోంపేట: మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

- వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్:

ఇచ్ఛాపురం నియోజకవర్గానికి టీడీపీ ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేసింది శూన్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ఉల్లిక్కిపడుతున్నారన్నారు. అశోక్ ఐదేళ్ల అధికారంలో, నాలుగున్నరేళ్ల ప్రతిపక్షంలో ఉండి ఈ ప్రాంత అభివృద్ధి జోలుకు పోలేదన్నారు. ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మతో కలిసి ఆమె ఆదివారం తన నివాస గృహం కె.శాసనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఇచ్ఛాపురంలో జరిగిన వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రపై ఎమ్మెల్యే అశోక్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. సీఎఫ్‌ల ద్వారా రెండు వందల రూపాయలు మహిళలకు ఇచ్చి సమావేశానికి రప్పించినట్లు చెబుతున్న ఆయన.. నిజాన్ని నిరూపించే దమ్ముందా అని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అందుకున్న ప్రతిఒక్క లబ్ధిదారు సామాజిక సాధికార యాత్రకు స్వచ్ఛందంగా వచ్చారన్నారు. వేల సంఖ్యలో జనం రావడంతో టీడీపీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. సామాజిక సాధికార యాత్ర విజయవంతం కావడంతో వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో ఎమ్మెల్యే అశోక్ అనాలోచనతో మాట్లాడుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమ రెడ్డి, సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మంధాకి ఉన్నారు.

చేసిన అభివృద్ధి ఏమిటో?

కంచిలి: ఇచ్ఛాపురం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బెందాళం అశోక్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమిటని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి ప్రశ్నించారు. కంచిలిలో విలేకరులతో మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు ఈ ప్రభుత్వంలో చేసిన మంచిని తెలియజేస్తూ ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన బస్సుయాత్రపై ఎమ్మెల్యే అశోక్ చేసిన విమర్శలను ఖండించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగున్నరేళ్లలో రెండేళ్లు కరోనా వ్యాధి పంజా విసిరినప్పటికీ వేలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనుల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. టీడీపీ నాయకుల్లాగా గ్రాఫిక్స్ చేసి చూపించలేదన్నారు. మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకునే రోజులు పోయాయని, ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. అశోక్ కళ్లకు పచ్చకామెర్లు కమ్మి ఉన్నాయి కాబట్టే ఈ నియోజకవర్గానికి తాము చేసిన అభివృద్ధి కనబడటం లేదని విమర్శించారు. సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, నాయకులు డొక్కరి బలరాం, రంగాల శ్రీనివాసరావు, గణప సింహాచలం పాల్గొన్నారు.

అశోక్‌కు అవగాహన లేదు

కవిటి: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు పలు పదవులు కట్టబెట్టిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతను, సామాజిక సాధికారతను గుర్తించలేని, అంగీకరించలేని అవగాహన లేమికి నిలువెత్తు నిదర్శనంగా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ నిలిచారని కవిటి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్, నాయకులు విమర్శించారు. కవిటిలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. చట్టసభల్లో 50 శాతం స్థానాలు మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉప ముఖ్యమంత్రి స్థాయి నుంచి పలు పదవుల కల్పన, జెడ్పీ చైర్‌పర్సన్‌లు, ఎమ్మెల్సీలు వంటి పదవుల్లో మహిళలకు అగ్రతాంబూలం ఇవ్వడం గుర్తించక పోవడం ఆయన అవగాహన లేమికి నిదర్శనమన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడంతో జీర్ణించుకోలేని ఎమ్మెల్యే అశోక్.. జెడ్పీ చైరపర్సన్ పిరియా విజయపై ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల్ని గౌరవించే సంస్కృతిని మరిచిపోవడం తగదన్నారు. రూ.700 కోట్లతో ఉపరితల మంచినీటి పథకం, రూ.200 కోట్లతో కిడ్నీవ్యాధుల చికిత్స పరిశోధనా కేంద్రం నిర్మాణం, రహదాల ఏర్పాటు, పాఠశాలల అభివృద్ధి, గ్రామసచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణం, ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునికీకరణ వంటి వాస్తవిక అభివృద్ధి అశోక్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో జేసీఎస్ కన్వీనర్ జల్లు యుగంధర్, నాయకులు పి.లక్ష్మణరావు, పి.నీలాచలం, వై.నీలయ్య, పి.శేఖర్, డి.కృష్ణారెడ్డి, డి.ధర్మారావు పాల్గొన్నారు.

ప్రజలు భూస్థాపితం చేస్తారనే అశోక్ భయం

సోంపేట: ప్రజలు టీడీపీని భూస్థాపితం చేస్తారని భయంతో స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ మేకపోతు గాంభీర్యంతో వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు చేస్తున్నారని ఎంపీపీ డాక్టర్ నిమ్మనదాస్ ఎద్దేవా చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు ఆధ్వర్యంలో నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా సామాజిక బస్సుయాత్రను విజయవంతం చేయడంతో టీడీపీ కేడర్‌లో భయాందోళనలు మొదలయ్యావన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లడంతో పార్టీ మనుగడే కష్టం కావడంతో వ్యవస్థలు మేనేజ్ చేస్తున్నారని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. 50 రోజులు దాటినా చంద్రబాబు బయటకు రాలేదంటే ఆయన చేసిన అవినీతిపై ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. రెండు సంవత్సరాలు కరోనా సమయంలో అద్దాల మేడల్లో దాక్కున్న టీడీపీ నాయకులు ఇప్పుడు ప్రజల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మెల్యే అశోక్ నియోజకవర్గానికి ఏమి చేశారో చెప్పాలన్నారు. నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. 2019 కంటే 2024లో ఘోర ఓటమిని టీడీపీ మూటకట్టుకోవడం ఖాయమన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ బతకల మోహనరావు, జింకిభద్ర సర్పంచ్ తామాడ పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, పార్టీ నాయకులు ఐ.లక్ష్మీనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన సురక్ష వైద్య శిబిరాలు

- టెక్కలి మండలంలో 6,896 మందికి వైద్య పరీక్షలు



బొరిగిపేటలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

టెక్కలి: టెక్కలి మండలంలో ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ముగిశాయి. గత నెల 30 నుంచి ఈ నెల 27 వరకు మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. మొత్తం 27 పంచాయతీల పరిధిలోని ప్రజలంతా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ వైద్య శిబిరాల్లో సాధారణ వైద్యులతో పాటు స్పెషలిస్టులు సైతం హాజరై ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 6,896 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అలాగే 14,757 మందికి వివిధ రకాల రక్త పరీక్షలు చేశారు. 370 మందిని మెరుగైన వైద్యసేవల్లో భాగంగా ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశారు. మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న రామకృష్ణ

మందస: వ్యక్తిగత డబ్బాలు కొట్టుకోవడం తప్పా టీడీపీ నాయకులు ఈ ప్రాంతానికి చేసేందేమీ లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు మడియా రామకృష్ణ అన్నారు. హరిపురంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల టీడీపీ నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలకే సమయమంతా కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యేగా స్వర్గీయ జుత్తు జగన్నాయకులు, ప్రస్తుతం రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు అభివృద్ధి చేశారన్నారు. తాతలు, తండ్రులు పేరు చెప్పుకుని రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. గౌతు శివాజీ, యార్లగడ్డ శిరీషాలు బిన్నళమదనాపురాన్ని దత్తత తీసుకుని ఏం చేశారని ప్రశ్నించారు. ఉద్దాన ప్రాంతంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎంపీగా తొమ్మిదేళ్లలో రామ్మోహన్‌నాయుడు ఏం సాధించారన్నారు. మందస మండల ప్రజలు ఆయనకు ఎక్కువ ఓట్లు వేశారని, కానీ, ఒక్క రూపాయి అయినా ఇచ్చారా అన్నారు. మాటల గారడీతో ప్రజలను బురిడీ కొట్టించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మంత్రి అప్పలరాజు ఎంత గొప్పగా మాట్లాడుతారో.. అంత గొప్పగానే అభివృద్ధి పనులు చేశారన్నారు. సమావేశంలో హరిపురం, బాలిగాం, నారాయణపురం సర్పంచ్‌లు జగన్నాథపురం పురుషోత్తం, చంద్రశేఖర్, బత్తిని తేజేశ్వరరావు, డాక్టర్ వైఎస్సార్ హెచ్‌యూబోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, భేతాళపురం ఉప సర్పంచ్ చీకటి మోహన్, ఉద్దానం క్లస్టర్ ఇన్‌చార్జి దున్న హరికృష్ణ, జగన్ ఉన్నారు.

వైద్యం కోసం రూ. 20 వేల సాయం

వజ్రపుకొత్తూరు: పెద్దమురహరిపురంలోని సాగర్ కాలనీకి చెందిన భద్రాచలం తారకేశ్వరరావు గుండెకు సంబంధిత వ్యాధితో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు ప్రకటించారు. దీంతో నిరుపేద అయిన తారకేశ్వరరావుకు అండగా పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు తమవంతుగా రూ. 20 వేలు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు చింత మురళి, సభ్యులు గొరకల అశోక్, బడే ధనుంజయ్, ఎస్.గణేష్, కె.సింహాచలం, దానేష్, గణేష్, లక్ష్మణ్, నాగేశ్వరరావు, టి.మురళి, నరేష్, భాస్కరరావు పాల్గొన్నారు.

రైతులు నష్టపోకుండా చర్యలు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి



మాట్లాడుతున్న దువ్వాడ వాణి

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో ఏ ఒక్క రైతుకు నష్టం రాకుండా చర్యలు చేపడతామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. ఆదివారం టెక్కలిలో విలేకరుతలో ఆమె మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట పొలాలకు సాగునీటి ఇబ్బందులు చోటు చేసుకున్నాయని వాటిని అధిగమించే విధంగా ఇప్పటికే అధికారులతో మాట్లాడినట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విన్నవించిన మేరకు ప్రస్తుతానికి కోటబొమ్మాళి, టెక్కలి మండలాల్లో పలు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీటి విడుదలకు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. నందిగాం, సంతబొమ్మాళి మండలాల్లో సైతం సాగు నీటి ఇబ్బందులను అధిగమించే విధంగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. సాగునీటి విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దని.. ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో సాగు నీటి కోసం జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు.

ఆధ్యాత్మికతపై దృష్టిపెట్టాలి



రామారావును సన్మానం చేస్తున్న గ్రామస్తులు

సోంపేట: మనిషి మనుగడకు ఆధ్యాత్మికత అవసరమని ఆధ్యాత్మికవేత్త నల్లకూర్మారావు అన్నారు. ఆధ్యాత్మికతపై యువత దృష్టిపెట్టాలన్నారు. ఉప్పలాం పంచాయతీ ఎకువూరు గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం ఆవరణలో గురుపౌర్ణమి నుంచి ఆదివారం వరకు శ్రీమద్రామాయణం ప్రవచనాన్ని కూర్మారావు నిర్వహించారు. భక్తులను ఆకట్టుకునేలా రామాయణంలోని సన్నివేశాలు వివరించారు. ముగింపు వేడుకల్లో భాగంగా కూర్మారావుకు గ్రామస్తులు రూ. 12 వేల విలువైన వెండితో తయారు చేసిన శ్రీరామ పట్టాభిషేకం మూర్తులు అందజేసి, దుశ్శాలువతో సత్కరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంత్రి సీదిరిని కలిసిన సీఆర్‌ఎంటీలు



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: తమ సమస్యలు పరిష్కరించాలని క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్లు (సీఆర్‌ఎంటీలు) కోరారు. ఈ మేరకు మంత్రి సీదిరి అప్పలరాజును పలాసలోని స్వగృహంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. మంత్రిని కలిసిన వారిలో సీఆర్‌ఎంటీల జిల్లా అసోసియేషన్ నాయకులు ఫిల్లేశ్వరరావు, వైకుంఠరావు, ఉర్నాన అప్పలరాజు, కృష్ణారావు, శ్రీనివాసరావు, దుర్యోధనరావు, శేషగిరి, రామారావుతో పాటు పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం, పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాల ప్రతినిధులున్నారు.

ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 'కీలు'



ఇచ్ఛాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధర్మపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కీలు సోమేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో జరిగిన ఎన్నికల్లో గతంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా పనిచేసిన సోమేశ్వరరావు సేవలను పరిగణంలోకి తీసుకొని కార్యదర్శి పదవికి సభ్యులు ఎన్నుకున్నారు. సోమేశ్వరరావుకు ఆపస్ మండల అధ్యక్షుడు బి.శంకరం, కార్యదర్శి ఎం.తారకేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు చిన్నాల వెంకటరమణ, కోశాధికారి బొబ్బిలి నాగేశ్వరరావులు అభినందనలు తెలియజేశారు.